52.

# అహంకార మమకారములను తొలగించుకున్న మానవుడు ఆనందమయుడే

ప్రేమస్వరూపులారా!

మానవుని యందు అహంకారము ఉండినంత వరకు కన్నబిడ్డలైనా, కట్టుకున్న భార్య అయినా ప్రేమించదు. కేవలం ప్రాకృత ధర్మమును ఆధారము చేసుకొని, లౌకికమైన జీవితమును ఆధారము చేసుకొని గౌరవించినట్టుగా ప్రేమించినట్టుగా నటించటమేగానీ హృదయ పూర్వకమైన ప్రేమతో నిన్ను ప్రేమించలేరు. క్రోధముండినంత వరకు మానవునకు శోకము తప్పినది కాదు. కోపమే మానవునకు దుఃఖాన్ని అందిస్తున్నది. వాంఛలు ఉండినంత వరకు నీ అభీష్టములు ఏమాత్రము నెరవేరవు. ఏనాడు నీవు ఈ లోభము, కామము, క్రోధము, అహంకారములను నిర్మూలనము గావింతువో ఆనాడే ఇతరులు నిన్ను ప్రేమింతురు, నీ దుఃఖములు నిర్మూలమగును, నీ వాంఛలు నెరవేరును, నీకు ఆనందము ప్రాప్తించును. మానవుని యొక్క సమస్త దుఃఖములకు, సమస్త విచారములకు, సమస్త అశాంతులకు మూలకారణము అహంకారము, క్రోధము, మోహము, లోభము. ఈ నాలుగు గుణములే మానవుని అశాంతిలో ముంచివేయుచున్నవి. అయితే మానవుడు చేసే సాధనలు దేని నిమిత్తమై చేస్తున్నాడు అని విచారణ చేస్తే సుఖము కోసమో, లేక ఆనందము కోసమో లేక శాంతి కోసమో సాధనలు చేస్తునట్టుగా భావిస్తున్నారు. మానవునకు ఆనందము గానీ, సంతోషము గానీ, దుఃఖము గానీ, విచారము గానీ ఏదీ కూడ ఈ సాధనలు అందించవు. ఈ ఆనందము, దుఃఖము ఎక్కడ నుండి ఆవిర్భవించుచున్నవో దానిని నీవు వశం చేసుకున్నప్పుడే నీకు ఈ ఆనంద దుఃఖములు రెండూ నిర్మూలమవుతాయి.

sri sathyasaivachanamrutam

నీకీ ఆనందము ఎక్కడ నుంచి పుట్టినది? నీకీ దుఃఖము ఎక్కడ నుంచి ఉద్భవించినది? ఆ స్థానమును నీవు వశము చేసుకోవాలి. అదియే మనస్సు. ఆనందము మనసునుండియే ఆవిర్భవించుచున్నది. దుఃఖము కూడా మనస్సు నుండియే ఆవిర్భవించుచున్నది. కనుకనే వేదాంతము 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని చెప్పింది. బంధమోక్షములకు, ఆనంద దుఃఖములకు పుట్టినిల్లు మనసే. కనుక నీవు ఈ మనస్సును స్వాధీనము చేసుకున్నప్పుడు నీకు ఎట్టి విచారము, ఎట్టి ఆనందము లేక సమత్వమైన జీవితాన్ని అనుభవించగలవు. అయితే ఆనందమును ఏ ఉద్దేశ్యముతో ఆశించుచున్నావో అదే ఉద్దేశ్యముతోనే దుఃఖాన్ని కూడా నీవు ఆశించాలి. సుఖదుఃఖములు రెండింటిని ఒకే భావముతో, ఒకే సంకల్పముతో, ఒకే ఆనందముతో నీవు స్వాగతము చేసినప్పుడే నీకు సమత్వము ఏర్పడుతుంది.

నిజముగా విచారణ చేసి చూచినప్పుడు ఆనందము నుంచి వచ్చే సుఖము కంటె దుఃఖమునుండి కలిగే సుఖమే శాశ్వతమైనది. పవిత్రమైన మహనీయుల చరిత్ర చూచినప్పుడు, ఆదర్శవంతమైన పురుషుల జీవితాన్ని విచారణ చేసినప్పుడు వీరందరు దుఃఖము నుండియే ఈ విధమైన ప్రశాంతత పొందగలిగారు. ఈ ప్రపంచములో ఎవరిని నీవు ఆదర్శ పురుషులని విశ్వసిస్తున్నావో వారందరు పూర్వము దుఃఖము నుండియే ఈ ఆనందమును పొందగలిగారు. ఎవరు మహనీయులని నీవు విశ్వసిస్తున్నావో ఆ మహనీయులు కూడ ఈ మహత్ తత్వాన్ని దుఃఖమునుండియే పొందగలిగారు. కనుక ప్రతి ఆదర్శ పురుషుడు, ఆదర్శ స్త్రీ, ఆదర్శ మానవుడు, ఆదర్శ మహనీయుడు దుఃఖము నుండియే ఈ ఆనందమును పొందగల్గుతున్నారు. 'న సుఖాత్ లభ్యతే సుఖమ్' అని సుఖము నుండి సుఖము ప్రాప్తించదు. దుఃఖము నుండియే సుఖము ప్రాప్తిస్తున్నాది. ఈ సత్యాన్ని ప్రతి వ్యక్తి గుర్తించటం అత్యవసరం. కానీ దుఃఖాన్ని వలదని సుఖాన్ని ఆశిస్తున్నాడు మానవుడు. ఇది ఆధ్యాత్మిక మార్గమునకు అత్యంత విరుద్ధమైనది. పుణ్య ఫలితము కావాలని ఆశిస్తున్నారు, పాపఫలితాన్ని వలదని విమర్శిస్తున్నారు. దీనినే వేదము

**పుణ్యస్య ఫలమిచ్ఛంతి, పుణ్యం నేచ్ఛంతి మానవః**
**నపాప ఫలమిచ్ఛంతి, పాపం కుర్వంతి యత్నతః**

srisathyasaivahini.org

అని చెప్పింది. పుణ్యఫలము కావాలని సాధకుడు ఆశిస్తున్నాడు. కానీ పుణ్యకర్మలు చేయటానికి ముందుకు రావటం లేదు. పాపఫలము వద్దు వద్దు అని అంటున్నాడు. వద్దు అంటున్నాడే గానీ, పాపకర్మలకు ముందంజ వేస్తున్నాడు. ఇదియే సాధనకు విరుద్ధమైన మార్గము. దేనిని నీవు ఆశిస్తున్నావో దానికి తగిన ప్రయత్నం చేయాలి. ఏది వద్దని విస్మరిస్తున్నావో దానికి నీవు ఏమాత్రము పూనుకోకూడదు. కానీ ఈనాటి సాధనా ప్రయత్నములన్నీ ఈ విధమైన మార్గములో జరుగుతున్నాయి.

**నవవిధ భక్తి మార్గములందు ప్రేమ అంతర్వాహినిగా ఉంటున్నది**

మానవునికి దైవత్వాన్ని పొందటం కానీ, సాక్షాత్కారాన్ని అనుభవించటం కానీ, స్వస్వరూపాన్ని దర్శించటానికి కానీ నవవిధ మార్గములు ఉన్నాయి.

**శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం**

ఈ నవవిధమైన మార్గములందు మీరు లోతుకు దిగి విచారించినప్పుడు ప్రేమయే దీనికి ప్రధానమైన ప్రాణంగా నిలుస్తున్నది. ప్రేమయే లేకపోతే శ్రవణమే చేయదు. ప్రేమయే లేక భజన చేయదు. ప్రేమయే లేక విష్ణునామ స్మరణే చేయదు. ఈ విధముగా నవవిధ మార్గములందు ప్రేమ అంతర్వాహినిగా ఉంటున్నాది. అన్నింటికిని ప్రేమయే ప్రధానము. అయితే ఈ బ్రహ్మతత్వమును ఏరీతిగా పొందాలి? బ్రహ్మ అనగా బృహత్ స్వరూపం. సర్వత్రా వ్యాపించినదే బ్రహ్మతత్వం . బ్రహ్మ యొక్క పుట్టుక స్థానమెక్కడ? విష్ణువు యొక్క నాభినుండి పుట్టినవాడని పురాణములు వర్ణిస్తూ వచ్చాయి. విష్ణువు అనగా ఎవరు? సర్వత్రా వ్యాపించటమే విష్ణువు యొక్క తత్వము. ఈ విష్ణువుకు, బ్రహ్మకు ఆత్మ అని పేరు. ఆత్మ అనగా ఏమిటి? 'అహస్సు' అనే దానినుండి పుట్టినది ఆత్మ. అహస్సు అనగా ఏమిటి? పగలు అని అర్థము. ఎప్పుడు ఈ 'అహస్సు' అనేది ప్రారంభమైందో అప్పుడు చీకటి దూరమైపోతుంది. కనుక అజ్ఞానము, అంధకారము దూరము కావాలంటే ప్రకాశము అనేది మనం వెలిగించాలి. అందుకే పరబ్రహ్మ స్వరూపునికి దివ్యజ్యోతి స్వరూపుడు అని పేరు పెట్టారు. ఇతనికి ఒక పేరు లేదు. దీనికి బృహత్ అని చెప్పారు. జ్యోతిర్మయుడు



sri sathyasai vachanamrutam

భగవంతుడు, ప్రకాశవంతమైనవాడు భగవంతుడు. ఈ ప్రకాశవంతమైన తత్వాన్ని అనుభవించాలనుకుంటే ఏమి చేయాలి? సత్యాన్ని అనుసరించు. ప్రకాశానికి సత్ అని పేరు పెట్టారు. మిగిలినవన్నీ నశించిపోయేవే. 'యద్దృశ్యం తన్నశ్యం' చూచేవన్నీ నశించేవే.

**అస్థిరం జీవనం లేకే అస్థిరం యౌవనం ధనమ్**
**అస్థిరం దారా పుత్రాది సత్యం కీర్తి ద్వయం స్థిరమ్**

అన్నీ కూడా నశించేవే, క్షీణించేవే. అన్నీ కేవలం అదృశ్యమయ్యేవే. కానీ నిల్చేది సత్యం. కనుకనే అట్టి బృహత్ స్వరూపమైన బ్రహ్మను సత్యం అని పిల్చారు. ఆ సత్యమునుండే జ్ఞానము ఆవిర్భవించింది. ఈ జ్ఞానము, సత్యము సర్వ వ్యాపకమైనవి. కనుకనే వేదము 'సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ' అని చెప్పింది.

**అనేకత్వములోని ఏకత్వమును దర్శింపచేసి, దైవత్వమునే నీ స్వరూపముగా మార్చుకునే నిమిత్తమై అవతారములు వచ్చాయి**

ఈనాడు మానవుడు పొందవలసినది ఏమిటి? సత్యమే జ్ఞానము. జ్ఞానమే అనంతము. అనంతమే బ్రహ్మస్వరూపము. పేర్లు మాత్రమే ఉన్నాయి గానీ సర్వవ్యాపకమైన దైవత్వం ఒక్కటే. అదే సత్. ఇట్టి సత్యస్వరూపుని పొందాలనుకుంటే ఏమి చేయాలి? సత్యాన్ని అనుసరిస్తూ రావాలి. సత్యమనగా ఏమిటి? త్రికాలములందు మార్పు చెందనిదే సత్యం. ఏ పదార్థములైనా మారవచ్చును గానీ సత్యము మారుటకు వీలు లేదు. భూతభవిష్యత్ వర్తమాన కాలములందు ఏకత్వంగా ఉండేదే సత్యమే. భగవంతుడు ఎందుకోసం అవతరిస్తున్నాడు? అనే ప్రశ్న వేసుకున్నప్పుడు అనేకత్వములోని ఏకత్వాన్ని దర్శింపచేసి, అనేకత్వములో నున్న ఏకత్వాన్ని గుర్తింపజేసి, ఏకత్వములోని దైవత్వాన్ని ప్రబోధించి, ఆ దైవత్వమునే నీ స్వరూపముగా మార్చుకునే నిమిత్తము అవతరిస్తున్నాడన్నది ఆధ్యాత్మికంగా ఈ అవతారము యొక్క సారము. ఇదియే జీవిత లక్ష్యము. అనేకంగా కనిపించే మానవస్వరూపాన్ని ఏకత్వంగా విశ్వసించాలి. దేహములు వేరు కావచ్చును. దేశములు వేరు కావచ్చును. మానవులు వేరు కావచ్చు. జీవితము యొక్క ప్రవర్తనలు వేరు కావచ్చును. కానీ అన్నింటి యందున్న ఏకత్వము ఒక్కటే. అదియే ఆత్మతత్వము. దానినే

srisathyasaivachanamrutam

conscience అన్నారు. ఈ conscience ప్రతివ్యక్తి పాదము నుండి తల వరకు ఉన్నది ఒక్కటే. నీయందు ఏ ఆత్మకలదో అందరియందు అదే ఆత్మ ఉన్నది. అలాగే అందరియందు ఏ ఆత్మకలదో ఆ ఆత్మ నీయందే ఉన్నది. ఈసత్యాన్ని గుర్తించి వర్తించటమే ఆధ్యాత్మికము యొక్క లక్ష్యము.

**నీ స్వరూపము, నీ ఆనందము, నీ నడవడిక సర్వము ఆత్మమయం**

కానీ ఈనాటి మానవుడు దేహాభిమానముచేత, తన స్వస్వరూప స్వభావము మరచి అనేకత్వముగా భావిస్తున్నాడు ఏకత్వాన్ని. ఉన్నది ఒక్కటే అయినప్పటికి అనేకంగా చూస్తున్నాడు. అదియే అజ్ఞానము. అనేకత్వంలో నున్న దానిని ఏకత్వంగా నిరూపించటమే ఆధ్యాత్మికతత్వము. అట్టి తత్వాన్ని గుర్తింపచేసే నిమిత్తమే అవతారములు అవతరిస్తూ వచ్చాయి. 'నాయనా! అందరు ప్రత్యేకించిన వారు కాదు. అందరు ఏకత్వంలో జీవించేవారే. **"మమాత్మా సర్వభూతాంతరాత్మా"**. నా ఆత్మయే మీ అందరియందు ప్రతిబింబిస్తున్నాది. ఈ దేహములన్నీ అద్దముల వంటివి. ఈ అద్దము ఎక్కడ నుండి వచ్చింది? మృణ్మయము నుంచి వచ్చినదే ఈ అద్దము. ఈ మట్టి యొక్క ఆకారములే ఈ అద్దములు. ఈ ప్రతిబింబములు చూచేంత వరకు మృత్తిక స్వరూపమే. కనుక మృత్యుంజయ తత్వమును తీసుకున్నప్పుడే అమరత్వము ప్రాప్తిస్తుంది. ఇట్టి ఏకత్వములో నున్న దివ్యత్వమును గుర్తించుటకు చక్కగా ప్రయత్నించాలి. అన్ని అద్దములు మట్టితో చేసినవి. ఈ మృణ్మయ దేహమును చిన్మయంగా మార్చుకోవాలి. ఈ చిన్మయంగా మార్చుకోటానికి వేరే సాధనలు చేయనక్కర లేదు. మృణ్మయమునందే ఉంటున్నది ఈ చిన్మయము. దానిని ప్రయత్న పూర్వకంగా సాధించ లేకపోవటంచేత సాధించలేమేమో అనుకోటం చాలా పొరపాటు. నీ స్వరూపమే ఆత్మస్వరూపం. నీ ఆనందమే ఆత్మానందం. నీ నడవడికే ఆత్మ నడవడిక. సర్వము ఆత్మమయం. అయితే సత్యతత్వాన్ని నీవు గుర్తించుకోటానికి తగిన ప్రయత్నం చేయటంలేదు. అగ్ని ఉంది. అగ్ని నీవు సరైన రీతిలో వినియోగించు కున్నప్పుడు అగ్ని అగ్నిగానే ఉంది. కానీ దానిని అలక్ష్యము చేసినప్పుడు ఈ అగ్ని ఆరిపోయి దానిపై నివురు కప్పుతుంది. అయితే ఊదినప్పుడు నివురు పోతుంది, అగ్ని కనిపిస్తుంది. అదేవిధముగా ప్రతిమానవునియందు ఆత్మస్వరూపమైన నిప్పు రగులుతూనే ఉంది. నీవు మధ్య మధ్య

sri sathyasai vachanamrutam

అలక్ష్యం చేయటంచేత అగ్నినుండి నివురు పుట్టి కప్పివేస్తున్నాది. నామస్మరణ అనే సాధన చేస్తే ఆ నివురు పోయి నిప్పు కనిపిస్తుంది. ఈ నిప్పుకోసం ప్రయత్నం చేయనక్కర లేదు. దానికి కప్పిన నివురుని ఊదివేస్తే చాలు. కప్పిన నివురు ఏమిటి? అదియే అహంకారము, క్రోధము, వాంఛ, అభిమానం. దేహాభిమానం అమితంగా పెరిగిపోతున్నాది మానవునకు.

ఈ దేహాభిమానమే అహంకారాన్ని పెంచుతున్నాది. అహంకార ముండినంత వరకు నీవు దేనిని సాధించలేవు. ఈ అహంకారము లేకపోవటమే నిజమైన మానవత్వము. పుట్టినప్పుడు ఎట్టి అహంకారము లేదు మానవునకు. క్రమక్రమేణా దాన్ని పెంచుకుంటూ వస్తున్నాడు. ఇది నాది, ఇది నేను. ఈవిధమైన అహంకారమును పెంచుకుంటూ అభిమానమును అభివృద్ధి గావించుకుంటున్నాడు. 'నేను' అనే అహంకారము, 'నాది' అనే మమకారము రెండే మానవుని యింత బంధన గావిస్తున్నాయి. రెండూపోతే మానవుడు ఆనందమయుడే. ఈ ఆనందము వేరే ప్రత్యేక సాధనలచేత లభించేది కాదు. ఈ సాధన ఎందుకు చెయ్యాలి? ఎందుకు చేస్తున్నారు. తాత్కాలిక మనస్సు తృప్తి కోసం చేస్తున్నారు. అయితే నీ అస్థిరమైన లోకమందు, అశాశ్వతమైన జీవితమునందు సత్యనిత్యమైనదాన్ని పొందటం అసాధ్యం. అనుభూతులన్నీ తాత్కాలికమైనవే. ఇది సత్యనిత్యమైనవి కాదు. సత్యనిత్యమైనది ఆత్మయొక్క ప్రజ్ఞయే. ఈ ఆత్మయే నిత్యము, సత్యము. నీయందే ఉంటున్నాది. నీవే ఆత్మవై ఉన్నావు. అట్టి భావము దినదినాభివృద్ధి గావించుకోవాలి.

**నీవెవరు అని ప్రశ్నించి తెలుసుకోవటం information, నేనెవరు అని శోధించి తెలుసుకోవటం transformation**

బోజాని చెప్పాడు who am I? అని "నేను ఎవరు?" అనే ప్రశ్న ఎవరు వేసుకోటం లేదు. ప్రతిమానవుడు 'నీవెవరు' అని ప్రశ్నిస్తున్నాడు గానీ తానెవరో తాను తెలుసుకోటానికి ప్రయత్నం చేయటం లేదు. నీవెవరు అని ఇతరులను ప్రశ్నించటం వలన నీకు లభించే ఫలితం ఏమిటి? అంతా information తెలుసుకోటమే. ఈ information వల్ల వచ్చే ఫలితం లేదు. నేనెవరో తెలుసుకుంటే transformation అయిపోతుంది. నీవెవరో అనేది information. నేనెవరు అని తెలుసుకోటం transformation. ఈ transformation స్థాయికి నీవు

sri sathyasai vahini

వచ్చినప్పుడు ఏ సాధనలు చేయనక్కర లేదు. నీవు నీవే అయిఉన్నావు. ఇంక దేనికోసం నీవు సాధన చేస్తున్నావు? అన్నింటికి మూలకారణం మనస్సే. ఈ మనస్సే మానవునికి దుఃఖాన్ని, విచారాన్ని, ఆనందాన్ని, శాంతిని అందిస్తున్నది. మనస్సును స్వాధీనం చేసుకుంటే అన్నీ కంట్రోల్ అవుతాయి. దీనినే అనుభవజ్ఞుడైన పతంజలి మహర్షి చక్కగా ఉపదేశం చేశాడు. "యోగః చిత్త వృత్తి నిరోధకః" అని. యోగము అంటే హఠయోగము మొదలగునవి కాదు, ఇవి రోగాలు. యోగమనగా అర్థము చేరటమే, కలయికనే. నేను ఆత్మతో చేరటమే యోగము. ఆత్మతో చేరితివా అంతకంటే ఆనందము మరొకటి లేదు. కేవలం దేహాన్ని పట్టుకొని జీవిస్తున్నది. మనస్సును పట్టుకొని సంచరిస్తున్నది. బుద్ధిని పట్టుకొని విచారిస్తున్నది. కానీ ఆత్మ సమీపానికి పోవటం లేదు. ఈ ఆత్మ సమీపానికి పోతివా, ఆత్మయే ఉన్నత స్థాయిలో ఉంటున్నది. అదే ఊర్ధ్వస్థాయిలో ఉంటున్నాది. దానిని చేరితే యింక ప్రయాణమే లేదు. అదియే చివరిస్టేషను. ఆ స్టేషను చేరాలి. మొట్టమొదటిది దేహము, రెండవస్థాయి ఇంద్రియములు, మూడవస్థాయి మనస్సు. తరువాత బుద్ధి, బుద్ధికి తరువాత ఉండేది ఆత్మ. నీవు కేవలం బుద్ధి వరకు కూడా పోవటంలేదు. మనస్సు వరకు మాత్రమే ప్రయాణం చేస్తున్నావు.

ఈ మనస్సంటే ఏమిటి? ఇంద్రియముల చేరికయే మనస్సు. ఇంద్రియములను కూడుకొని మనస్సుగా తయారు చేసుకొని ఈ మనస్సులో అన్ని విధములుగా మగ్గిపోతున్నావు. కనుక confusion, depression మనస్సు వల్లే కలుగుతున్నది. ఈ రెండు చేరితే ఆత్మభావము ఫ్యూజ్ (fuse) అయిపోతున్నది. ఏమిటి ఈ దేహము? పాంచభౌతికమైన దేహము. ఇది ఏనాటికి నిత్యసత్యమైనది కాదు. ఏ నిమిషములో ఏమౌతుందో కనుక అనిత్యము, అశాశ్వతమైన దేహాన్ని ఆధారము చేసుకోవద్దు. ఈ దేహాభిమానం చేత ధనాభిమానం కూడా పెరిగిపోతున్నది. ఈ ధనాభిమానం చేతనే గుణాభిమానం పెరిగిపోతున్నది. ఈ గుణాభిమానం చేతనే సర్వవిధముల వ్యామోహం కల్గుతున్నాది. అయితే ఈనాడు చదువు, ధనము ముఖ్యము అన్నారు. చదువు చెడ్డది కాదు. ధనము చెడ్డది కాదు. దాని వినియోగించుకునే వ్యక్తియందే మంచి, చెడ్డా చూడండి. ఇది నీరు. ఈనీటి యొక్క రంగు ఏమిటి? తెలుపు- తెల్లటి నీరు ఎఱ్ఱటి సీసాలో వేస్తే ఎఱ్ఱగ

sri sathyasai vahini

కనిపిస్తుంది. ఈ తెల్లని నీరు నల్లటి సీసాలో వేస్తే నల్లగా కనిపిస్తుంది. అదే నీరు తెల్లటి సీసాలో వేస్తే తెల్లగా కనిపిస్తుంది. అట్లే ఈ విద్య, ధనము పరిశుద్ధమైన జలమువంటివే. సాత్వికమైన హృదయములో ప్రవేశపెడితే ఇవి పరిశుద్ధంగానే కనిపిస్తాయి. రజోగుణ సంబంధమైన హృదయములో ప్రవేశపెడితే ఎర్రగా కనిపిస్తుంది. కానీ ఈ ఎర్ర రంగు నీటిది కాదు సీసా యొక్క రంగు. ఇదే నీరు నల్లటి సీసాలో వేస్తే తమోగుణము. అది నల్లగా కనిపిస్తుంది. ఈ నలుపు నీటిది కాదు. సీసా ది. కాబట్టి ఈ తెలుపు, ఎరుపు, నలుపుకూడను మానవుని మనోభావములే గానీ పవిత్రమైన విద్య యొక్క దోషముగానీ, ధనము యొక్క దోషముగానీ కాదు. ఈవిధంగా మానవుడు సక్రమమైన మార్గము ఏమిటి అనే సత్యాన్ని గుర్తించుకో లేకపోతున్నాడు. వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అంటున్నాడు. ఇది చెడ్డది, అది మంచిది అని విమర్శిస్తున్నాడు. ఈ మంచి చెడ్డలు నీ మనస్సు యొక్క ప్రభావములే గానీ బయట నున్న వ్యక్తుల ప్రభావము కాదు.

**దృష్టి పవిత్రముగా నున్నప్పుడు సృష్టి అంతా పవిత్రముగా కనిపిస్తుంది**

కనుక ఈనాడు మనం మార్చుకోవలసింది ఏమిటి? దృష్టిని మార్చుకోవాలి. దృష్టి పవిత్రమైనదిగా ఉంటే సృష్టి అంతా పవిత్రంగా కనిపిస్తుంది. కనుక మొట్టమొదట దృష్టిని మార్చుకోవాలి. హృదయము పవిత్రము చేసుకోవాలి. ఈవిధమైన సాధనలచేత అనేకత్వములో నున్న ఏకత్వమును దర్శించుటకు వీలవుతుంది. కానీ ఇంకా కొన్ని ప్రదేశములందు కొన్ని కొన్ని సాధనల చేత అపమార్గములు పడుతున్నారు. ఈ కాన్ఫరెన్స్ నుండి ఒక లెటరు వచ్చింది. ఎన్నియో సందేహాలతో ఉంటున్నారు మానవులు. ఈ సందేహాలన్నీ ఎక్కడ నుండి వచ్చాయి? నిజంగా ఈ సందేహాలకు మూలకారణం పరిపూర్ణమైన విశ్వాసము లేకపోవటమే. దైవముపైన పరిపూర్ణ విశ్వాసమున్న వానికి సందేహాలు రావటానికి అవకాశమే లేదు. అందువల్లనే పీటర్ అనే బెస్తవాడు జీసస్‌ను కలసినప్పుడు ఆయన పూర్ణవిశ్వాసముతో ఉండేవాడు. కానీ ఒక్కడు మాత్రము అన్నింటిని అనుమానించేవాడు. వానినే డౌటింగ్ థామస్ అన్నారు. డౌటింగ్ థామస్ కే ఈవిధమైన సందేహాలు, ప్రశ్నలు రావటానికి అవకాశముంటున్నది. అయితే సాధనా మార్గంలో సహజంగానే వస్తుంటాయి సందేహాలు. దైవంపైన విశ్వాసం పరిపూర్ణమైనప్పుడు



sri sathyasaivahini

సందేహాలు పటాపంచలైపోతాయి.

**జీసస్ అందరూ సత్యస్వరూపులే, పవిత్ర స్వరూపులే, భగవంతుని బిడ్డలే అని విశాలభావంతో ప్రచారం చేస్తూ వచ్చాడు**

**మొట్టమొదటి సందేహము:** జీసస్ చెప్పాడట 'నేనే సత్యాన్ని, నేనే సరైన దారిని చూపేవాడిని, వేరే మానవులు ఈ జగత్తులో లేరు! దీనిని ఒక వ్యక్తి ఈ మహాసభ లోపల కొన్ని సంప్రదింపులలో వెల్లడి చేశాడు. ఇది నిజమా, కాదా?' అని ప్రశ్న వేశాడు నాకు. ఇది సత్యమో, అసత్యమో నీవే విచారించుకో నీకే తెలుస్తుంది. జీసస్ "నేనే సత్యాన్ని, నేనే కాపాడేవాడను, సర్వబాధల నుండి నేనే రక్షించేవాడను", అని ఎప్పుడూ చెప్పలేదు. అతనికి ఎట్టి సమయమందు అహంకారము లేదు. ఈ వ్రాసే రచయితలు వీటిని కల్పిస్తూ వచ్చారు. బైబిలును అనేకమంది వ్రాస్తూ వచ్చారు. 500 రకముల బైబిల్సు ఉన్నాయి. మొట్టమొదట బైబిలును Luke (Jews) వ్రాశారు. తరువాత Peter వ్రాసాడు, Thomas వ్రాసాడు. బెస్తవారి దగ్గర పీటర్ కూర్చొని జీసస్ మాట్లాడేవి అన్నీ వ్రాసుకొనేవాడు. అతనే వ్రాసాడు మొట్టమొదట. అది ఎప్పుడు, ఎట్టి సమయంలో వ్రాసాడు. బెస్తవారితో మాట్లాడే సమయంలో నేను చూచుకుంటాను. నేనే చూచుకుంటాను. నేను చూచుకోటానికి వచ్చినవాడను అని అహంకారముతో చెప్పలేదు. వారికి ఒక ఉత్సాహమును, ధైర్యమును అందించే నిమిత్తమై నేను చూచుకుంటాను పో అన్నాడు. ఆ చిన్న వాక్యమును ఆధారం చేసుకొని అనేకమంది పండితులు తానే చూచుకుంటాను, ఎవరికి ఏ ఆపద లేకుండా నేనే కాపాడతాను అని జీసస్ చెప్పినట్టుగా చెబుతున్నారు. ఇంతే కాకుండా I am the messenger of God అని తాను చెప్పినట్లుగా రెండవది I am the son of God అని చెప్పినట్లుగా, మూడవది I and my father are one అని చెప్పినట్లుగా బైబిల్‌లో వ్రాస్తుంటారు. కానీ జీసస్ ఆవిధంగా ఎప్పుడూ చెప్పలేదు. నేను messenger అని చెప్పలేదు. నేను son of God అని చెప్పలేదు. I and my father are one అని కూడా చెప్పలేదు. ఇది ఎవరు చెప్పారు. ఆ పుట్టిన సమయం లోపల ముగ్గురు అరేబియన్ రాజులు వచ్చారు. వారు ఎక్కడకో ప్రయాణమైపోతూ star ని చూచి వారు వచ్చారు. అందులో ఒకరు చూచారు బాలుని. ఇతను దైవము యొక్క messenger గా కనిపిస్తున్నాడు నాకు అన్నాడు. రెండవవాడు

sri sathyasai vachanamrutam

చెప్పాడు not messenger, son of God. భగవంతుని బిడ్డ అనే సత్యాన్ని నిరూపించే వాడుగా వచ్చాడు. ఇంకొక రాజు చెప్పాడు no, no. son and father are one. ఇది అరేబియన్ రాజులు చెప్పిన విషయము. దీన్ని ఆధారము చేసుకొని బైబిల్‌లో వ్రాసారు. ఏనాడు కూడా జీసస్‌కు అహంకారమే లేదు. బాధపడే వారిని చూచి కరుణారసము చల్లేవాడే జీసస్. అతని హృదయము నిండా కరుణయే. అయితే కొన్ని కొన్ని సందర్భములలో విమర్శలను ఎదుర్కోటానికి ప్రయత్నం చేశాడు. మొట్టమొదటి నుండి జీసస్ గురించి విరుద్ధంగా చెప్పేవాడు పాల్. కానీ కొంతకాలం జరిగిన తర్వాత పాల్ స్వప్నంలో జీసస్ పోయి పాల్! నీకు నేను ఏమి ద్రోహం చేశాను? నీకు ఏమి బాధలు కలిగించాను? ఎందుకు నన్ను ఇంత విమర్శిస్తున్నావు? అని ప్రశ్నించేటప్పటికి పాల్ ఇది నా భ్రమయే, నా దోషమే, నా అహంకారమే, నా అజ్ఞానమే అని తలంచి జీసస్ devotee గా మారాడు. ప్రతియుగమునందు ప్రతి మహనీయుల టైము నందు ఈ విధమైన సంకల్పాలు జరుగుతూనే వస్తుంటాయి. మంచిని చెడ్డగాను, చెడ్డను మంచిగాను భావించే వ్యక్తులు అనేకంగా ఉంటారు. ఆ తరువాతనే పాల్ మారిపోయాడు. తరువాత సెయింట్ పాల్ అని పేరు వచ్చింది. ఈ విధంగా కొన్ని కొన్ని బైబిలునందున్న సత్యవాక్యములను సరైన మార్గములో అర్థం చేసుకొంటే జీసస్‌లో ఏదోషము లేదు. అందరిని భగవత్ మార్గములో ప్రవేశపెట్టాలని జీసస్ ఆశించిన వాడు. కానీ కట్టకడపటికి శిలువకు గురిచేసే సమయంలో తాను ప్రార్థించాడు. Oh! Father! నేను ఏమి తప్పు చేశాను? నన్ను ఎందుకీ విధంగా శిక్షిస్తున్నావు? అని ప్రశ్నించాడు. దీని అంతరార్థము ఏమిటి? తాను దైవము యొక్క బిడ్డగాను, దైవము తండ్రిగాను అర్థము తీసుకోవచ్చును. కానీ I am God అని చెప్పలేదు, లేక I am messenger అని చెప్పలేదు. I am son of God అని చెప్పలేదు. I and my father are one అని కూడా చెప్పలేదు. ఏదీ చెప్పలేదు. తాను పలికిన పలుకులలో మానవత్వానికి అర్థం కావటానికి తాను బిడ్డ, దైవము తండ్రిగా భావిస్తూ వచ్చాడు. శిలువకు కొట్టిన తర్వాత తల్లి మేరీ వచ్చి ఏడుస్తున్నాది. అప్పుడు అశరీరవాణిగా వినిపించింది. "All are one my dear son, be alike to every one" అని అందరి ఏకత్వాన్ని చక్కగా గుర్తించి చెప్పినవాడు జీసస్. దీనిని బట్టి విచారణ చేయగా తాను దైవము యొక్క బిడ్డగానూ, దైవము

sri sathyasai vachanamrutam

తన తండ్రిగానూ మనకు స్పష్టమవుతూ వచ్చింది. కాబట్టి నేనే సత్యాన్ని, నేను మీ బాధలను నివారణ చేస్తాను, నేను తప్ప మరొకరు లేరు అని అహంకారముతో చెప్పలేదు. కానీ ప్రతి అవతారమందు ఈవిధమైన తత్వాన్ని చెబుతూ వచ్చింది. **"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః"** అని భగవద్గీత యందు కృష్ణుడు చెప్పాడు. నీవు నా దాసుడవు, నీవు నా భక్తుడవు నాకు నమస్కారం చేయి. నీ సర్వస్వాన్ని నేను చూచుకుంటాను అని అక్కడ ఈ నేను, నేను అనేది ఒక్క అవతార తత్వమందు మాత్రమే వస్తూ వచ్చింది. **"చాతుర్వర్ణ్యం మాయాసృష్టం"** అన్నాడు భగవద్గీతలో. నాలుగు రకములైన వర్ణముల వారు నా సృష్టియే. ఏమిటి ఈ colours? నీగ్రోలు, భారతీయులు నలుపు వర్ణము. నలుపు రంగు, తెల్లని రంగు, పచ్చనిరంగు, ఎర్రని రంగు ఈ నాలుగు వర్ణములవారు నా సృష్టియే అన్నాడు. వర్ణములనే పదములకు కులములు, మతములని విభాగం చేసుకుంటూ వచ్చారు. భగవంతుడు అట్లా చెప్పలేదు. బ్రిటీషువారు తెల్లవారు. చైనీయులు పచ్చనివారు. రష్యన్సు ఎరుపురంగు. ఈ రంగులన్నీ నా సృష్టియే అన్నాడు. భగవంతుడు చెప్పినవి విశాలమైనవే గానీ, సంకుచితమైనవి కాదు. కనుక ఈ సందేహాలకు ఎవ్వరు కూడా అవకాశం ఇవ్వకండి. మీరు క్రిష్టియన్సు కావచ్చు, హిందువులు కావచ్చు, ముస్లిములు కావచ్చు, జొరాష్ట్రియన్లు కావచ్చు. అందరు దైవమును ఒక్కడుగా భావించాలి. మొట్టమొదట రోమన్సు క్రిష్టియన్లు కాదు. జీసస్ అవతారం తరువాత క్రిష్టియన్ అనే పేరు వచ్చింది. అతను మొట్టమొదట ఏమన్నాడు? నేను Personia అన్నాడు. "పెర్సొనా" అంటే ఏమిటి? దైవత్వముతో కూడిన వాడను అన్నాడు. బ్రిటీషువారు దాన్ని 'person' అని పేరు పెట్టారు. దీనినే భారతీయులు "పురుషః" అని అంటారు. ఇవన్నీ ఒకే అర్థం నుండి వచ్చినవే. Persona అనగా పవిత్రమైనదని అర్థం. కాబట్టి ప్రతి మానవుని యందు దైవత్వం ఉంది కాబట్టే అతనిని person అని పిలుస్తూ వచ్చారు. ఈ person అనగా అతనియందు దైవత్వమున్నది. దీనినే భారతీయ సంస్కృతి యందు, వేదశాస్త్ర యితిహాస పురాణములందు పురుషుడు అని పేరు పెడుతూ వచ్చారు.

**యల్లబ్ధ్వాపుమాన్ ఇచ్ఛారామోభవతి**
**తృప్తో భవతి, మత్తో భవతి, ఆత్మారామో భవతి।**

sri sathyasai vahini amrutam

పురుషతత్వానికి ఈ విధమైన వర్ణనలు చేస్తూ వచ్చారు. దివ్యత్వము సర్వులందూ ఉంటున్నాది. సర్వుల యందు ఉన్న ఏకత్వాన్ని అనేకత్వంగా భావించి భిన్నత్వం అనుభవిస్తున్నారు. ఈనాడు చేయవలసింది ఏమిటి? అనేకత్వంలో నున్న ఏకత్వమును దర్శించాలి. అనేకత్వమును ఏకత్వంగా అనుభవించాలి. అదియే సత్యసాయి సంస్థల యొక్క ప్రధాన లక్ష్యముగా మీరు భావించాలి. ఎట్టి భేదములకు అవకాశము ఇవ్వకూడదు. ఎట్టి భిన్నత్వమునకు అవకాశం ఇవ్వకూడదు. ఎట్టి ద్వేషమునకు అవకాశం ఇవ్వకూడదు. ఏవిధమైన భేదభావము ఉండకూడదు. అందరి యందున్నది ఒక్కటే. ఈ సత్యాన్ని మీరు భావించుకుంటే ఇదియే నిజమైన ఆధ్యాత్మిక ప్రచారము. ప్రచారము కాదు ఆచరణ చాలా అవసరం. నా ముందు రెండు మైకులున్నాయి. ఆయన ముందు ఒక మైకు ఉంది. కానీ ఈ రెండు మైకులనుండి వచ్చే సౌండు ఒక్కటే. ఆ ఒక మైకు నుండి వచ్చే సౌండు ఒక్కటే. యీ శబ్దములు వేరువేరుగా వస్తున్నాయి. కానీ రెండూ శబ్దాన్ని అందించేవే. దివ్యత్వము అనేక రూపములతో గోచరమవుతున్నాది. ప్రతి మానవుని నుండి వచ్చే శబ్దము నాభి నుండి వచ్చేటు వంటిది. ఆ నాభిస్థానమే బ్రహ్మస్థానము. కొంతమంది తాత్కాలిక తృప్తి నిమిత్తమై పెదవుల నుండి చెబుతుంటారు. ఇది contraction talk అన్నారు. ఈ contraction talk death తో సమానమే. మన మాట హృదయమునుంచి రావాలి. అదియే complete confidence. ఆ పరిపూర్ణ విశ్వాసము కల్గిన వానికి సందేహములు రావు. అందరియందు దైవత్వము ఉంటున్నది. ఎవరేమి చెప్పినా సత్యముగానే ఉంటుంది. కానీ ఆ సత్యము నాకు అన్వయిస్తుందా లేదా అని విచారణ చేసుకోవాలి. సత్యము ఒక్కటే కదా! సత్యాన్వేషణ ఎందుకు చేయాలి అని పెట్టుకుంటే. ప్రతి మానవుని యందు సత్యము, అసత్యము, ధర్మము, అధర్మము, హింస, అహింస ఈవిధమైన మార్పులు కలుగుతున్నాయి. దీనికంతా మొన్న చెప్పినట్లు ఒక ఉదాహరణము. చక్కని బంగారు ఉన్నాది. పవిత్రమైన pure gold. ఈ pure gold ను కొంతకాలం నీ దగ్గర పెట్టుకున్నావు. కొంత కాలమునకు copper ను చేర్చావు. మరికొంత కాలమునకు silver ను చేర్చావు. మరికొంత కాలమునకు lead ను చేర్చావు. మరి కొంతకాలమునకు యిత్తడిని చేర్చావు. ఈవిధముగా అనేక లోహములు చేర్చేకొలది ఏమైపోయింది ఈ బంగారు? దీనిని ఏమని పిల్చేది? దీని స్వరూపమే పాడైంది.

sri sathyasai vahamrutam

బంగారు స్వస్వరూపము పోయింది. అనేక లోహములు చేర్చేటప్పటికి తన స్వస్వరూపమే మరుగు పడిపోయింది. ఈనాటి మానవుడు అంతే. ఈనాటి మానవుడు పుట్టినప్పుడు పవిత్రమైన మానవుడు. అతడు అందరితో చేరి కేవలం అసత్యము, అన్యాయము, హింస అనే గుణములు ఆత్మపైన ప్రవేశపెట్టేటప్పటికి ఆత్మ కూడా మారిపోయి సుఖదుఃఖముల స్వరూపంగా అయిపోయింది. ఈ జనన మరణములకంతా మూలకారణం ఇదియే. Pure ఆత్మగా ఉంటున్నప్పుడు ఈ జనన మరణములకే అవకాశము లేదు. ఈ శరీర అభిమానము, మానాభిమానము, బుద్ధి అభిమానము అన్నింటిని చేర్చేటప్పటికి తాను ఏ స్వరూపము కాకుండా మానవుడుగా రూపొందుతూ వచ్చాడు. ఈ మానవుని యందు కూడా మంచి చెడ్డల మానవుడుగా రూపొందుతూ వచ్చాడు. తన స్వస్వరూపాన్ని తాను మర్చిపోతున్నాడు. ఈ స్వస్వరూపము మర్చిపోవుటకు కారణం ఏమిటి? ఈ లోహములు చేర్చటమే దీనికి మూలకారణము. దీన్ని తిరిగి పరిశుద్ధము చేయాలి. ఏవిధంగా చేయాలి. అగ్నిలో వేయాలి. అప్పుడు ఈ విడివిడి లోహములంతా వేరు వేరైపోయి స్వచ్ఛమైన బంగారుగా తయారౌతుంది. మన దుర్గుణాలు దూరమై పోవాలి. ఈ పవిత్రమైన gold కు చెడ్డభావాలు చేరెనా వాటిని పవిత్రము చేయాలి. దుర్గుణములను అగ్నిలో ఆహుతి చేయాలి. ఈనాడు అసూయ, ద్వేషము అధికమైపోతూ వస్తున్నాయి. అందులో భక్తులు, సాధకులలో ఈ అసూయ పెరిగిపోతున్నది. ఈ అహంకారముతో బాటు అసూయ కూడా పెరిగి పోతున్నాది. ఈ రెండు పెరిగి పోవటం చేత మానవత్వమునే నాశనము చేసుకుంటున్నారు. ఒకరి దగ్గర ఒకమాట, మరొకరి దగ్గర మరొకమాట మాట్లాడుతున్నాడు మానవుడు. వీనిని మానవుడని ఎట్లా చెప్పటానికి వీలవుతుంది? ఈ లోహములన్నీ చేర్చుకోటం చేత మానవత్వాన్ని కోల్పోతున్నాడు. విశ్వాసమును దృఢముగా పెట్టుకోవాలి. దీనితో ఏవిధమైన చేరికలు చేరకుండా చూచుకోవాలి. బంగారులో బంగారు చేర్చుకో, అనగా సత్సంగమును సత్సంగముతో చేర్చుకో. దుస్సంగముతో చేరకూడదు. దుస్సంగమే చాలా చెడ్డది. మొట్టమొదట దుర్గుణములను దూరం చేయాలి.

**త్యజదుర్జన సంసర్గం భజసాధు సమాగమమ్**
**కురుపుణ్య మహోరాత్రం స్మరనిత్య మనిత్యతామ్**

sri sathyasai vachanamrutam

దుస్సంగము నుండి దూరం కావాలి. మానవుని మాటలు, చేష్టలు చాలా సాధువుగా ఉన్నట్టు కనిపిస్తుంటాడు. కానీ చర్యలు మహారాక్షసత్వంగా కనిపిస్తుంటాయి. అట్టివారిని మీరు విశ్వసించి చెడిపోకండి. ఇలాంటి కల్తీ బంగారు చాలా పెరిగిపోతుంది. మీరు ఎప్పుడు pure gold గా తయారుకావాలి. Pure gold కొంచెం ఉన్నా ఎంతో విలువ. కానీ అన్ని లోహములు చేరి యింత పెద్దముద్దగా ఉన్నా సరియైన విలువ రాదు. ముద్దగా ఉన్నదంతా క్వాంటిటీ. చిన్నది ఉన్నా క్వాలిటీ. క్వాలిటీని ప్రధానంగా తీసుకోవాలి.

**పంటపండని భూమి పది ఎకరములు ఏల**

**కొంచెమైన చాలు మంచి భూమి**

ఒక అరఎకరము చాలు. ఎంతైనా పంట పండించుకోవచ్చును. కనుక మనము ఈనాడు ఈ విధమైన మార్గములో ప్రవేశించి పవిత్రమైన హృదయాన్నంతా పాడు చేసుకుంటున్నారు. ఎవరి మాట వినక్కరలేదు. నీ conscience ను నీవు అనుసరించు. అదే follow the master. Who is your master. Your conscience is your master. Face the Devil. Fight to the end. Finish the game. యిదే మన జీవితము యొక్క తత్వము. ఈ కల్తీ లోహాలంతా చేర్చుకోటం చేత ఈ స్వామి, ఆస్వామి అని నీ ఆధారమైన స్వామిని నీవు మర్చిపోతున్నావు. నీ స్వామిని నీవు మర్చిపోతున్నావు. నీ స్వరూపాన్ని నీవు మర్చిపోతున్నావు. ఎవరికి వారు చేతులారా చేసుకుంటున్నది ఇది. నీ consicence ను నీవు follow చేయి. నీకు మంచి అని తెలిసి తృప్తి అయిన దానిని నీవు చేయి. నేను ఎప్పుడు ఫోర్స్ చేయటం లేదు. నేను ఎవరినీ force చేయటం లేదు. ఎందుకోసం force చేయటం లేదు? నీలో సహజమైన source ఉన్నాది. అదే ఆత్మ సోర్స్. Force అనేది మిలట్రీ ఫోర్సు. సోర్సు అనేది ఆత్మసోర్సు. అది ప్రేమతో కూడినది. ఆ ప్రేమను మీరు నిరంతరం పెంచండి. ఈ మొదటి ప్రశ్నకు ఈ విధమైన జవాబుగా మీరు తీసుకోండి.

ఏమిటి నేనే కాపాడతాను. నేనే సత్యమును, మరొకటి సత్యము కాదు అని జీసస్ చెప్పలేదు. అందరూ సత్యస్వరూపులే. అందరు పవిత్రస్వరూపులే. అందరు భగవంతుని బిడ్డలే అనే విశాల భావముతోను ప్రచారము చేస్తూ వచ్చాడు. ఒకరినొకరు తిట్టుకోకూడదు. ఒకరినొకరు కొట్టుకోకూడదు. హింసించుకో కూడదనేదే తన ప్రచారం.

sri sathyasai vachanamrutam

## స్వప్నములో కనిపించనంత మాత్రాన స్వామికి దయలేదని భావించటం పొరపాటు

**రెండవ ప్రశ్న.** స్వామి అనేకమందికి స్వప్నాలలో వస్తుంటాడు. కానీ ఆస్వప్నాలు మాకెందుకు రాకూడదు అని. ఇది కూడను ఒక విధమైన అమాయకత్వమే. ఇది కేవలము వారు తలచుకుంటే స్వప్నములోకి వచ్చేది కాదు. నీవు ఎందరినో తలుచుకుంటావు. వారందరు నీస్వప్నములో వస్తున్నారా? రావటం లేదు. స్వప్నములో రాకపోవటం మూలాన స్వామికి మీ మీద దయ లేదనుకోటం చాలా పొరపాటు. ఈ స్వప్నము అనేది ప్రతిబింబము. స్వప్నాన్ని గురించి చెబుతాను కొంతదూరం. స్వప్నము రావటం చాలా మంచిది. కొన్ని చెడ్డవి వస్తుంటాయి. కొన్ని భయంకరమైనవి వస్తుంటాయి. కొన్ని బాధాకరమైనవి వస్తుంటాయి. కొన్ని ఆనందకరమైనవి వస్తుంటాయి. కొన్ని దుఃఖకరమైనవి వస్తుంటాయి. ఇవన్నీ రావటం ఎందువలనంటే నీ సంకల్పములో అప్పుడప్పుడు అన్నీ చేరిపోయినాయి. అవన్నీ లోపల చేరి stock గా అయినాయి. ఈ స్వప్న రూపంలో అవి బయట పడిపోటం చాలా మంచిది. ఇవన్నీ నాలో నున్న reflection, reaction, resound అని భావించాలి. అయితే స్వామి యొక్క స్వప్నము reaction, resound, reflection కాదు. నేను తలుచుకున్నప్పుడే వస్తుంది కానీ మీరు తలుచుకున్నప్పుడు రాదు. నిన్న ఒక వ్యక్తి వచ్చాడు. నన్ను ఎప్పుడూ చూడనివాడు. మీకు తెలుసు నిన్న వాయించారు మహ్మదెన్ను. వారు నన్ను చూడలేదు. నేను చెప్పాను. నీవు అమెరికాకు వెళ్లినప్పుడు అక్కడ కారు యాక్సిడెంట్ అయిపోయింది. అక్కడ నేను కనిపించాను తెలుసునా అన్నాను. Oh! my God అని ఏడ్చినాడు పాపం లోపల. నేను ఎప్పుడూ చూడలేదు, అమెరికా లోపల కనిపించాడు. తిరిగి అదేరాత్రి నిద్రించాడు. నీవు వచ్చే birthday కి పుట్టపర్తి వస్తున్నావు అని స్వప్నంలో చెప్పాను. నిన్నటి దినము వచ్చారు. అది స్వప్నం. అయితే ఈ స్వప్నంలో కూడా కొన్ని confusion స్వప్నాలు వస్తుంటాయి. స్వామి కనబడుతున్నాను అంటాడు. తిరిగి నీ భావాలు కనిపిస్తూనే ఉంటాయి. అది యిది రెండు కలసి మిక్స్ అయిపోతాయి. ఇది సరియైనది కాదు. ఇది స్వామి సంకల్పముతో వచ్చినది కాదు. ఆహార దోషము చేత, అజీర్ణదోషం చేత కలిగేది. నేను వస్తే స్పష్టంగా వచ్చి స్పష్టంగా మాట్లాడిపోతాను. నీకు పుట్టపర్తి వెళ్లినట్లుగా స్వప్నం వచ్చింది. తిరిగి అమెరికా వెళ్లినట్లు స్వప్నం వచ్చింది. ఒకే దానిలో రెండు మూడు కలసి

sri sathyasai vachanamrutam

పోతుంటాయి. ఇది ఎట్లాగంటే బంగారు లోపల లోహాలు చేరినట్లుగా చేరిపోతాయి కాబట్టి that is not right. దేనికోసం వచ్చునో స్వప్నంలో సత్యంగా సరైన స్వరూపంగా కనిపించటమే సత్యము. స్వప్నములో కనిపించకుండా పోయినంత మాత్రమున నాపై స్వామికి దయ లేదని భావించటం చాలా పొరపాటు. దయ ఉంది స్వామికి.

**'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావనతో కర్మలు చేయి**

**మూడవ ప్రశ్న.** అందరు సాధనలు చేస్తున్నారు. నేను కూడా సాధన చేయాలని ఆశపడుతున్నాను. కానీ నాకు సమయం చిక్కటం లేదు. ప్రాపంచిక సంబంధమైన నా వ్యాపారమునందు పనులయందు నేను నిమగ్నుడనై స్వామిని సరైన హృదయంతో చింతించటం లేదు. కనుక స్వామి సేవ చేయటానికి సరైన సమయం చిక్కటం లేదన్నాడు. ఇది చాలా తప్పు. స్వామి చింతన చేయాలంటే కొంతకాలం నీకు ప్రత్యేకంగా కావలెనా? నీ ఆఫీసుకు పో. ఆఫీసు మాననక్కర లేదు. ఆఫీసులో నీవు పనిచేయి. సక్రమమైన పని చేయి. చేస్తూ ఇందత దైవము పని అని భావించు. అదీ దైవకార్యమే. అదీ స్వామి కార్యమే. దైవసేవయే. దీనిని పురస్కరించుకొనియే work is worship, duty is God అన్నారు. కనుక నీవు ప్రత్యేకంగా కూర్చొని సాయిరాం, సాయిరాం అని చెప్పనక్కరలేదు. ఏ పని ఐనా చేయి. ఇదంతా దైవకార్యంగా భావించు. **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అన్నారు. **"సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం"** అనుకున్నారు. అన్ని పనులు భగవత్ప్రీత్యర్థం చేస్తున్నాను అనుకో. అదే గొప్ప సాధన. నీవు సాధన చేయాలనుకున్నావు. సాధన చేయాలని కూర్చున్నావు. ధ్యానములో కూర్చున్నావు ఒక్క క్షణమైనా మనస్సు నిలిపావా? ఈ meditation ఎందుకోసం చేయాలి? ఇలాంటి దానికి నీవు టైము ఎందుకు కోరాలి? కాబట్టి నీ ఇంటి పని నీవు చూసుకో. ఏ పని చేసినా సర్వకర్మ భగవత్ప్రీత్యర్థంగా భావించు. ఎందుకోసమనగా **'కర్మానుబంధీని మనుష్యలోకే'.** ప్రతి మానవుడు కర్మ చేత కూడి ఉంటున్నాడు. కర్మ అనగా ఏమిటి? బజార్లు ఊడ్చటము, జబ్బు చేసినవారిని చూడటము యింత మాత్రమే సేవ కాదు. అది మాత్రమే కర్మ కాదు. కర్మ అనగా చలనశక్తియే కర్మ. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా కర్మయే. నీ కన్నులు రెప్పలు పడుతున్నాయి. అదంతా కర్మయే. నీవు నిద్రిస్తున్నావు. అదంతా కర్మయే. నీవు చదువుకుంటున్నావు అదంతా కర్మయే. నీవు భుజిస్తున్నావు,

srisathyasaivachanamrutam

అదంతా కర్మయే. సర్వము కర్మము. కర్మ లేక మానవుడు క్షణమైనా నిల్చుటకు వీలుకాదు. సర్వము కర్మయే, అయితే భగవత్ప్రీత్యర్థంగా చేసే కర్మ సార్థకమవుతుంది. ఇది నా కర్మ. ఇది దైవకర్మ అని భేదము పెట్టుకోకూడదు. నీవు, దైవము అని రెండు వేరు వేరుగా పెట్టుకున్నప్పుడు అన్నింటిలో వేర్వేరు ఫలితమే వస్తుంది. You and God are not seperate. You and God are one. ఆవిధమైన నమ్మకము చేత మనం చేయాలి. ఏ చిన్న పని చేసినా అదిగొప్పదిగానే మారుతుంది. ఈ చిన్నదే పెద్దదిగా ఉంటున్నాది. బజార్లో పోయి అందరు సేవ చేయటం, హాస్పిటల్ కు పోయి పేషంట్లకు సేవచేయటం, చేయి తప్పులేదు, కానీ అదియే సేవగా భావించుకోకూడదు. నీ ఆఫీసులో, నీ బిజినెస్‌లో, నీ duty లో, నీవు సక్రమంగా పని చేయి. ఆ duty యే కర్మ. అదియే నిజమైన సాధన. గవర్నమెంటు నుండి డబ్బు తీసుకుంటున్నావు. ఆ గవర్నమెంటుకు టక్కరికొట్టి సాధన చేస్తుంటే అది దోషము కాకుండా ఎట్లా పోతుంది? నీవు జీతము తీసుకుంటున్నావు జీతమునకు తగిన సేవ చేయి అదే సేవ. నీవు ఆఫీసులో సేవ చేయాలి. ఈ పేపర్లు దిద్దుకోటం సేవయే. నీ ఎకౌంట్స్ చూచుకోటం కర్మయే. నీ బ్యాంక్ మేనేజ్‌మెంటు చూచుకోటం కర్మయే. ఏ పనైనా చేసుకో. ఆ పనీ, ఈ పనీ అని పెట్టుకోవద్దు, దైవపని అనే భావంతో చేయి. నాకు సమయము లేదని ఏమాత్రము సాకు చెప్పకూడదు. కావలసినంత సమయము ఉంటున్నాది. 24 గంటలు టైము. 24 గంటలకు ఆఫీసులో ఎంత పని చేస్తున్నావు? 8 గంటలు లేదా 7గంటలు చేస్తుంటావు. కానీ తరువాత ఏమి చేస్తున్నావు? 6 గంటలు నిద్రపోతున్నావు. మిగతా టైము ఏమి చేస్తున్నావు. నీ స్వవిషయములు చూచుకుంటున్నావు. దీనికి కావలసినంత టైము ఉంటున్నాది. టైము లేదని ఎందుకు చెప్పాలి? ఒక చిన్న కథ చెబుతున్నాను మీకు. ఒక వ్యక్తి పరమభక్తుడు కావాలని ఆశిస్తూ వచ్చాడు. అప్పుడు చెప్పాడు. 'స్వామీ! నా ఆయుష్షు ఎంతవరకు యిచ్చారు మీరు?' 'నాయనా నీకు 80 years ఆయుష్షు యిచ్చానన్నాడు' భగవంతుడు. ఆ చాలా సంతోషం. అయితే 20-25 years వరకు నా ఆటలు, పాటలు చదువు దానిలో జరిగిపోతుంది. మరి 25 years కి సంపాదిస్తాను, చివరి 25 సంవత్సరములు నా భవిష్యతుకు తగిన భద్రత, నా పిల్లలకు తగిన యోచనలంతా నేను చేసుకుంటున్నాను. నాకు టైము లేదన్నాడు. మళ్ళీ చెప్పారు.

srisathyasaivachanamrutam

'నాకు 80 years ఇచ్చారు. ఈ 80 years అంతా నా పనులకు సరిపోతుంది. ఇంకా 20 years యియ్యమన్నాడు. అప్పుడు భగవంతుడు చెప్పాడు. 'పిచ్చివాడా! నన్ను తలచుకోటానికి 20 సం॥లు అధికముగా కావలెనా? 20 సం॥లు అక్కరలేదు. 2 సెకండ్లు చాలు నీకు. ఎట్లా? కరెంటు ఉంటున్నాది. నీకు లైటు కావాలి. స్విచ్ ఆన్ చేయటానికి ఎంత టైము పడుతుంది? Only సెకండు. దీనికి సెకండు కూడా కాదు. స్విచ్ వేయగానే లైటు వెలుగుతుంది. ఈ లైటు వేయటానికి 20 సం॥లు కావలెనా? ఈ 20 సం॥లు యింక దేనికి ఉపయోగపెడతావో ఏమో! ఇదంతా నీ సోమరితనము యొక్క లక్షణము. అన్నాడు. కాబట్టి, నిజంగా భగవంతుని తల్చుకోవాలంటే ఒక్క క్షణము చాలు. స్థిరమైన చిత్తముతో ఒక్క క్షణము తల్చుకుంటే చాలు. Slow and steady wins the race. మనము టైము వ్యర్థము చేసుకోకూడదు. కాలము భగవత్స్వరూపమే. Time is God. Don't waste time. Time waste is life waste. కాలమును సరైన రీతిలో వినియోగం చేస్తూ రా. అదియే నీ సాధనం. కాలమును భగవత్స్వరూపకంగా భావించుకో, నీవు పవిత్రమైపోతావు. కాబట్టి నాకు టైము లేదని చెప్పి వగచనవసరము లేదు. స్వామి చింతన చేయటానికి, స్వామి సేవ చేయటానికి టైము లేదని విచారణ చేస్తున్నారు. ఈ ప్రశ్న వ్రాసింది ఎవరో కానీ పక్కా లేజీనే. సోమరితనం నీవు దూరం చేసుకో. ఈ సోమరితనం దూరం చేసుకుంటే ఎంతైనా పవిత్రమైన మార్గము పొందుతావు. Laziness is rust and dust. Realisation is rest and best ఈ సత్యాన్ని నీవు చక్కగా గుర్తించుకో.

**ఎక్కడ చేసినా సేవ, సేవయే**

**ఇంక నాల్గవ ప్రశ్న:** మేము విదేశాల్లో ఉండటం చేత సాయి సేవలు అమితంగా చేయటానికి అవకాశం చిక్కటలం లేదు. మేము ఇండియాకు వచ్చి, ఇండియాలో ఉండి స్వామి సేవ సంపూర్తిగా హృదయ పూర్వకంగా చేయాలి అని ఆశిస్తున్నారు.

ఇది కూడా ఒక రకంగా సోమరితనమే. సేవ చేయటానికి స్వదేశం ఏమిటి, ఇండియా ఏమిటి? భగవంతుడు సర్వాంతర్యామి. అక్కడ చేసినా సేవయే ఇక్కడ చేసినా సేవయే. ఎక్కడ చేసినా సేవ చేయవచ్చు. అంతేగానీ ప్రశాంతి నిలయమే వచ్చి స్వామి దగ్గరే

sri sathyasai vahamrutam

ఉంటుండి స్వామి సేవ చేయాలని కోరటం స్వార్థమే. రిటైరు అయిన తరువాత అప్పుడు కావాలంటే యిక్కడకు వచ్చి చేరండి సంతోషమే. కాని పిల్లలు, వారి బాధ్యతలు దండిగా ఉంటుంటాయి. వారి చదువులు ఉంటున్నాయి. నీ duty చట్టము ఉంటున్నాది. నీ duty నీవు సక్రమంగా అక్కడే చేయి. అంతేగానీ ప్రశాంతి నిలయం వస్తే కొన్ని దినములు బాగానే చేయవచ్చు. కానీ కట్టకడపటికి యిక్కడ సంఘములో చేరి నీ మనస్సు మరింత భ్రమించిపోవచ్చును.కాబట్టి ఇక్కడికి రానక్కర్లేదు. Don't come. మీరు అక్కడే ఉండి సేవ చేయండి. ఎక్కడ చేసినా సేవ సేవయే. స్వామి ఏ సేవను ఆశించటం లేదు. నా యొక్క పని నేనే చేసుకుంటున్నాను. యింతమంది మా పిల్లలంతా ఉన్నారు. ఎవరు చేస్తున్నారు నాకు సేవ? కానీ ఆశిస్తున్నారు మీలాగే. స్వామి సేవ చేయాలని. ఏ పవిత్రమైన వ్యక్తులకో, పవిత్రమైన సేవ చిక్కుతుంది. నాకు సేవ చేయనక్కరలేదు. సేవ చేయకుండా పోయినంత మాత్రమున నాకు దూరమైన వారని నేను భావించను. నేను ఏనాడు సేవను ఆశించటం లేదు. మీ సేవలు మీరు చేసుకోండి. మీ కర్తవ్యాన్ని నిర్వర్తించుకోండి. నాకు ఏ సేవ అక్కరలేదు. నాకు 73 సం॥లు. నా కాళ్లు భద్రముగా ఉన్నాయి. నా కన్నులు చాలా భద్రంగా ఉన్నాయి. నా చెవులు భద్రంగా ఉన్నాయి. చేతులు భద్రంగా ఉన్నాయి. నా పనులు నేను చేసుకో గలను. కనుక, నేను యింకొకరి సేవ నేను ఆశించటం లేదు. శక్తి లేనివారికి మీరు సేవ చేయండి. అదియే స్వామి సేవగా భావించండి. మీరు అనుకుంటారు. స్వామికి కాలునొప్పి ఏమో ఎట్లా తిరుగుతుంటారు అని. నాకు కాలినొప్పి ఎప్పుడూ రాలేదు. ఏ నొప్పి నేను అనుభవించలేదు. ఎవరిదైనా తీసుకున్నప్పుడు నేను అనుభవిస్తానే గానీ లేకపోతే నాకు స్వతఃసిద్ధముగా ఏ నొప్పి లేదు. అంతేగానీ ఈ దేహానికి ఏ బాధలు లేవు. ఎప్పుడు చూచినా blood pressure normal. Dr. అల్‌రజాకు తెలుసు. మధ్య మధ్య చెబుతుంటాను. 'అల్‌రజా blood pressure ఎంత ఉందో అని. స్వామి perfect, normal అన్నాడు. సాధారణంగా 120/80 నార్మల్. కానీ నాకు 117/78 అది పర్‌ఫెక్ట్ నార్మల్ currect B.P.. Pulse చూడు అంటాను. మీ పల్సు చూస్తే 68. Perfect normal. ఎంతసేపు మాట్లాడినా, ఏ పని చేసినా నాకు B.P. గానీ ఏమీ పెరుగదు. Body అంతటి పవిత్రమైనది. అదే purity, patience, perseverence. ఈ మూడు చేరటం వల్ల పవిత్రమైనది. కనుక



srisathyasaivahini.org

మీరు ఎవ్వరూ నా సేవ చేయనక్కర లేదు. మీ సేవలు మీరు చేసుకొని, మీ కుటుంబ సంక్షేమాన్ని ఆశించి దీనికి తగిన ప్రయత్నములు మీరు చేసుకోండి.

**హృదయపూర్వకంగా భగవంతుని ప్రేమిస్తే, నీ సర్వకర్మలు సక్రమంగా జరుగుతాయి**

**5వ ప్రశ్న** : మేము చేసుకున్న కర్మల ఫలితముల బాకీలు ఎట్లా తీరుతాయి?

ఇవన్నీ ఒక విధమైన బాకీలుగా భావిస్తున్నారు వారు. అన్నింటికి కర్మ ఫలము నివారణ కావాలనుకుంటే ఎలాంటి కర్మలైనా సరే, తీరరాని కర్మలైనా సరే, కఠినమైన కర్మలైనా సరే, బాధపెట్టే కర్మలైనా సరియే, అన్నింటికి ప్రేమమయమైన మెడిసిన్సుతో మీరు నివారణ చేసుకోవచ్చు. అదియే ప్రేమ. ప్రేమకంటే మించినది మరొకటి లేదు. హృదయపూర్వకంగా ప్రార్థిస్తే తప్పక కర్మ విమోచనం అవుతుంది. అయితే, కొంతమంది ప్రార్థిస్తుంటారు. పూజరూములో కూర్చుంటారు. సాయిరాం సాయిరాం అని జపం చేస్తుంటారు. ఏమిటే, చాకలివాడు గుడ్డలు తెచ్చాడా? చాకలివానిపై పోతుంది మనస్సు. నీవు జపం చేస్తున్నావు. చాకలివానిపై మనస్సు ఎందుకు రావాలి? తరువాత కొంతమంది జపం చేస్తుంటారు. ధ్యానంలో కూర్చుంటారు. వంటింటి పొగ వస్తుంటుంది. వంట మాడిపోతున్నాది, చూడు అంటాడు భార్యను. ఈ విధమైన సాధన చేస్తే ఎట్లా భగవత్ప్రార్థన అవుతుంది? నీవు చేసే సాధనలంతా చంచలమైన మనస్సుతో చేస్తున్నావు. స్థిరమైన మనస్సుతో చేయి. తప్పక ఫలితము లభిస్తుంది. ఏ సాధనలైనా చేసుకో. హృదయపూర్వకంగా ప్రేమించు. ప్రేమతో సర్వరోగములు నివారణైపోతాయి. సర్వబాధలు నివారణవుతాయి. సర్వచింతలు నివారణ అవుతాయి. మొట్టమొదట నీవు ప్రేమను పెంచుకో. ప్రేమను ఏ రీతిగా పెంచాలి. భగవంతుడు ప్రేమ స్వరూపుడని భావిస్తే ఆ ప్రేమయే పెరిగిపోతుంది. కానీ భగవంతుని ఏదో రకంగా భావించుకుంటే ప్రేమ ఎట్లా అభివృద్ధి అవుతుంది? కాదు ప్రేమయే దీనికి సరైన ఔషధము. మొక్కను టిన్నులో పెట్టి నీరు పోస్తే ఏమైపోతుంది. కుళ్లిపోతుంది. కానీ ఆ చెట్టును భూమి లోపలనే పెట్టి నీరు పోయాలి. అదేవిధంగా భగవంతుని రూపమును, నామమును ఎక్కడో పెట్టి చేస్తే కాదు. హృదయమనే భూమిలో నాటు. ప్రేమ అనే జలము పోయి. తప్పక అభివృద్ధి అయిపోతుంది. కనుక

sri sathyasai vachanamrutam

ప్రత్యేకంగా మరొక సాధన చేయనక్కరలేదు.

**అన్ని రూపములు, అన్ని నామములు ఒకే దివ్యతత్త్వమునకు చెందినవే**

6వ ప్రశ్న చాలా విచిత్రమైనది:

మా పూజరూములో రాముడు, కృష్ణుడు, అల్లా, ఈశ్వరుడు, జీసస్ అన్ని ఫొటోలు పెట్టుకుంటాం. దీనిమధ్యలో స్వామి ఫొటో కూడా పెట్టుకుంటాము. తప్పా అడుగుతున్నారు.

భగవంతుడు సర్వస్వరూపుడు అనే విశ్వాసం దృఢంగా ఉంటుంటే ఏ ఫొటో పెట్టుకుంటే భయమేమి? నీవు రాముని పూజించు, ఈశ్వరుని పూజించు, అల్లాను పూజించు, జీసస్‌ను పూజించు, జోరాష్ట్రను పూజించు, సాయిని పూజించు. అందరూ ఒక్కటే అనే భావము పెట్టుకో. చిన్న ఉదాహరణ. అప్పుడప్పుడు చెబుతుంటాను. భారతదేశములో స్వీట్లకు అనేక పేర్లుంటాయి. గోధుమహల్వా, బాదంఖీరు, గులాబ్‌జాం, జిలేబి, లడ్డు, మైసూర్‌పాక్ చేసుకుంటారు. అయితే వీటి రూపనామములు వేరు వేరే గానీ అన్నింటియందున్న చక్కర ఒక్కటే. నీవు రాముని పూజించు, సాయిని పూజించు, విష్ణువును పూజించు, అల్లాను పూజించు, జీసస్‌ను పూజించు అందరియందున్న దివ్యత్వం ఒక్కటే అనేది పెట్టుకో. ఒక్కటే భావం నీవు పెట్టుకో. All are one అని పెట్టుకున్నప్పుడు ఈ భేదము ఏ మాత్రం బాధించదు. ఒకవేళ యితరుల ఫొటోలు యిష్టములేకపోతే నీకు యిష్టము వచ్చినది పెట్టుకో. ఒకవేళ సాయిబాబా యిష్టము లేకపోతే సాయిబాబా ఫొటో కూడా తీసివేయి. రాముడు యిష్టము లేదంటే రాముని ఫొటో తీసేసెయ్యి. ప్రేమతో ప్రార్థించడం ముఖ్యం గానీ, ఈ ఫొటోలు కాదు. అప్పుడప్పుడు మా పిల్లలకు చెబుతుంటాను. ఒక పిల్లవాడు పరీక్షలకు పోతున్నాడు. గణితము అతనికి సరిగా రాదు. ఈ Maths examination రేపు వస్తున్నది. స్వామిని పూజ చేశారు. ఆ దినము గణితములో ఫెయిల్ అయ్యాడు. సరే maths లో ఫెయిల్ అయ్యానని స్వామి ఫొటో తీసి కప్‌బోర్డ్‌లో పడేశాడు. రెండవ దినము గణితము 2వ పరీక్ష. ఆనాడు రాముని ఫొటో పెట్టాడు. పూజ చేశాడు. ఆనాడు యింకా సరిగా చేయలేదు. మూడవ దినము exam కి పోవాలి. అకౌంట్స్ పేపరు. Maths రానివాడు అకౌంట్స్ ఏమి చేయగలడు? సరిగా చేయలేదు. రాముని ఫొటో తీసి కప్‌బోర్డ్‌లో

sri sathyasai vachanamrutam

పదేశాడు. ఇంక ఏ దేవుని పూజచేయాలి. అమ్మకు చాలా ప్రేమ. మగ దేవతల కంతా ప్రేమరాదు అనుకున్నాడు. దేవి పటం పెట్టాడు. పూజ చేశాడు. తిరిగి పరీక్షకి వెళ్ళాడు. ప్రశ్నాపత్రమే కనిపించలేదు వీడికి. యింటికి వచ్చి దేవి ఫొటో తీసేసాడు. మరునాడు వినాయకుని ఫొటో పెట్టి పూజించాడు. అగరవత్తు వెలిగించాడు. దాని పొగ కప్‌బోర్డ్‌లోని ఫొటోలకు పోతుంది. వినాయకుని కోసం వేసిన అగరబత్తి వాసన మిగిలిన వారు పీలుస్తున్నారని ఒక గుడ్డతో సాయిబాబా, రాముని, అమ్మవారిని ఫొటోలను కట్టివేశాడు. అప్పుడు సాయిబాబా ప్రత్యక్షమై కనిపించి చెప్పాడు.

ముక్కుకు చేరకూడదని ముక్కుకు గుడ్డకట్టేశావు. ఈ ఫొటోల వల్ల కాదు. ఫొటోలు ఫొటోలుగా తీసుకుంటే ప్రయోజనం లేదు. You may worship picture as God, but not God as picture. ఈ God as picture అని నీవు తీసుకుంటున్నావు. ఈనాడు నీవు picture గా తీసుకోలేదు. సాక్షాత్ రూపమని నీవు కట్టేశావు. అందుకే వెంటనే సాక్షాత్కారమైంది. మీరు చేసే పూజలన్నీ పిక్చరుకు చేస్తున్నారు. ఫొటోలుగా తీసుకోకూడదు. సాక్షాత్ రూపకంగా తీసుకోవాలి. అప్పుడే నీ అభీష్టములన్నీ నెరవేరుతాయి. ఈనాటి మానవులనేకమంది picture ను picture గా తీసుకుంటున్నారు. మంచిగా చదువుకో. నీ మస్తకాన్ని పుస్తకములో చేర్చు. అప్పుడు నీవు తప్పక ప్యాసుకాగలవు. ఆవిధమైన బోధ చేశాను. అదేరీతిగా ఏ రూపం పెట్టుకుంటే ఏమి? ఏ నామము తలచుకుంటే ఏమి? అన్ని నామములు, అన్ని రూపములు ఒక్క దైవత్వమువే. అందరు దైవస్వరూపులే. ఎవరు లేకపోతే నీ తల్లిదండ్రులనే పూజించు. వారు కూడా దైవస్వరూపమే. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధి దేవోభవ. అలాంటి పరిస్థితిలో ఈ దైవమే, ఆ దైవమే అనే సందేహాలు నీకెందుకు రావాలి? దైవముపైన ఏమాత్రము అనుమానములకు అవకాశము ఇవ్వకూడదు. God is God. అంతేగానీ రూపనామములతో విమర్శలు చేయవద్దు. కనుక ఏ ఫొటోనైనా పెట్టుకో. ఏ నామమైన తల్చుకో. దైవం ఒక్కడే. ఈ సత్యాన్ని మీ హృదయంలో పెట్టుకో. భేదాలు పెట్టుకొని ఫొటోలు మార్చకండి. మీకి ఏది యిష్టమో దాన్ని చేసుకోండి. What ever you like you do. అది నిజమైన మార్గము.

**Help ever, hurt never; అది నాకు చాలా తీపి**

srisathyasaivachanamrutam

**ఏడవ ప్రశ్న :** స్వామీ! మేము చేసే ప్రాపంచిక సంబంధమైన సాధనలలోపల ఏవిధమైన సాధన స్వామికి తృప్తికరంగా ఉంటుంది? అని ప్రశ్న.

స్వామికి సంతృప్తి కావాలి. మేము చేసే సాధన స్వామిని సంతృప్తి పర్చాలి. ఏవిధమైన సాధన చేస్తే స్వామికి సంతృప్తి. దాన్ని నేను చేస్తాను అన్నాడు.

దీనికి సమాధానం ఒక్కటే. నాకు ఏదీ అవసరము లేదు. సర్వ మానవులను దైవ స్వరూపులుగా విశ్వసించు. అందరియందు దైవత్వము విశ్వసించు. అది నాకు చాలా ప్రేమ. అది నాకు చాలా ఇష్టము. ఏది చేస్తే నీకు ఆనందమని అనిపిస్తుందో దాన్ని యితరులకు నీవు చేయి. నీకు ఏది యిష్టమో ఆ యిష్టమైనది యితరులకు చెయ్యి. కానీ నీకు happy ఉండి యితరులకు హాని చేస్తే అది మంచి సాధన కాదు. అనేక పర్యాయములు చెప్తూనే ఉన్నాను. Help ever– hurt never అది నాకు చాలా తీపి. ఎవరికైనా నీవు help చేస్తూరా. ఎవరిని బాధపెట్టవద్దు. హింస పెట్టవద్దు. ఇంతేకాక, యితరులపైన దుర్భావములు ఏమీ పెంచుకోవద్దు. వారు నిన్ను దూషించినా, ద్వేషి అయినా నీవు ప్రేమించు. అదియే స్వామి ప్రధాన లక్ష్యము. ఎంతమందో లోకములో ఉంటున్నారు. అందరు స్వామిని పూజించేవారు కాదు. ఒక పరిపూజిస్తూ, మరొకపరి దూషిస్తూ ఉంటారు. నేను ఈ రెండింటిని చూడను. నేను అందరిని ప్రేమిస్తూనే ఉంటాను. వారి వారి ప్రేమ వారిదే. వారి వారి జబ్బు వారిదే. వారి వారి రోగము వారిదే. వారి వారి ఖర్మ వారిదే. వారు చేసినది వారే అనుభవిస్తారుగానీ అది నా వరకు రాదు. ఈనాడు కాకపోయినా ఏనాటికైనా వారు చేసినది తప్పునది కాదు.

**ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పగలరు?**
**అనుభవించుట సిద్ధమన్నా**
**రాముడంతటి వాడు రమణి సీతను బాసి**
**పామరుని వలె ఏడ్చెనన్నా**
**అలనాటి పాండవులు ఆకులలములు మేసి**
**అడవిపాలై పోయిరన్నా**
**ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పగలరు?**

sri sathyasaivachanamrutam

## అనుభవించుట సిద్ధమన్నా

నీవు మంచిచేస్తే నీకు మంచే వస్తుంది. నీవు చెడ్డ చేస్తే చెడ్డ వస్తుంది. దీన్ని మొట్టమొదట గుర్తించుకొని మంచో చెడ్డో యోచన చేయి. నేను ఎవ్వరిని ద్వేషించటం లేదు. ఎవరిని నేను సందేహించటం లేదు. నన్ను నమ్మని వారిని కూడా నేను నమ్ముతుంటాను. అదే నా సహజము. నన్ను నమ్మకపోయినా వారిని నేను నమ్ముతాను. వారు అనుకుంటారు నేను నమ్మటం లేదే, స్వామి మమ్మల్ని ఎందుకు నమ్ముతున్నారు? అది స్వామికి తెలియదు అనుకుంటారు. నాకు అదికాదు నా నమ్మటం ఒక్కటే. అందరూ నాకు ఒక్కటే. అందరు ఆనందంగా ఉండాలనే నా ఆశ. అది నేను ఆశిస్తున్నాను. కానీ నీ capacity ని బట్టి అది మారిపోతున్నాది. చెప్పానే, నీరు ఎప్పుడు తెల్లగానే ఉంటుంది. ఎలాంటి రంగు సీసాలో వేస్తే అలాంటి రంగు మారుతుంది. కాబట్టి మంచి చెడ్డలు నీలోవి గానీ నాకు లేవు. నాలో లేవు,రావు. నేను ఎప్పుడు "లోకాస్సమస్తాః సుఖినో భవంతు" అని ఆశిస్తాను. అందరు క్షేమంగా ఉండాలి. నన్ను మీరు ద్వేషించినా, నేను మిమ్మల్ని ప్రేమిస్తాను. అది నా సహజము. అదే Divine Quality. మీరు ఈనాడు దూషిస్తారు. రేపు పూజిస్తారు. ఈనాడు పూజిస్తారు. రేపు దూషిస్తారు. ఇదంతా deepvine అది దీని లక్షణము. అనగా త్రాగినప్పుడు ఒక రకంగా మాట్లాడతాడు. త్రాగనప్పుడు యింకో రకంగా మాట్లాడుతాడు. కాబట్టి అది worldly desire. Worldly desire లో నీవు పూర్తిగా మునగటం చేత ఒకతూరి అటు ఒకతూరి ఇటు పోతుంటుంది. కానీ పరిపూర్ణ ప్రేమ కల్గినవాడు ఎప్పుడు ఒక్కటిగానే ఉంటాడు. వాడు నన్ను మరచినా నేను వాడిని మరువను. నేను ఎప్పుడు వాని వెంటనే, ఇంటనే, కంటనే, జంటనే ఉంటాను. అలాంటి వారు ఎంతో అదృష్టము చేసుకున్నవారు. ఎంతో పవిత్రమైన హృదయులు. ఎన్ని జన్మ జన్మల యొక్క పుణ్యఫలమో ఈవిధంగా జన్మించారు. అది ఈ జన్మములో వచ్చినది కాదు. ఎన్నో జన్మల యొక్క ఫలితమే యిది. స్వామి ఏది ప్రీతి , ఏది అయిష్టము అని మీరు ఏమాత్రము అనుకోనక్కరలేదు. మీరు హృదయపూర్వకంగా ఏదైనా చేయండి, అది నాకు ఇష్టమే. నీ హృదయ పవిత్రతే నాకు కావాలి. ఆవిధమైన ప్రేమతో మీరు ఏ సేవైనా చేయండి. అయితే మీకు పరిపూర్ణమైన విశ్వాసమే స్వామిపై ఉంటే స్వామి ఆజ్ఞ శిరసావహించి చేయండి. నేను ఎప్పుడు ఎవరికి ఏదీ

sri sathyasai vachanamrutam

చెడ్డ చెప్పను. ఏది చెప్పినా మీ మంచికోసమనే. What ever I say, what ever I do, it is good for you, not for me. నా పని అని నాకు ఒక్కటీ లేదు. అంతా మీ పనులే. తెల్లవారి మొదలు రాత్రివరకు నేను మీ పనులే చేస్తుంటాను. కనుక మీపై ప్రేమ లేదని మీరు భావించకండి. కానీ అదృష్టవంతులకు పవిత్రమైన సేవలు, పవిత్రమైన సన్నిధులు లభిస్తుంటాయి. ఆ భాగ్యము వారికి దక్కింది. వారికి చిక్కిందే నాకు చిక్కలేదేయని అసూయకు అవకాశము యివ్వకండి. అన్ని జబ్బులకంటే తీరని జబ్బు ఒక్క అసూయ. Cancer కి అయినా మందు ఉంది గానీ, అసూయకు మందు లేదు. Cancer ను cancle చేయవచ్చు. కానీ, అసూయకు ఏ మందు లేదు. కృంగబెట్టి కృంగబెట్టి కట్టకడపటికి జబ్బుతోనే నశించిపోతావు.

**శరీరములోని ప్రతి అంగమును పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టండి**

ప్రేమస్వరూపులారా! సాయి సంస్థలవారందరు విశాలమైన హృదయాన్ని పెంచుకొని అసూయకు అవకాశము యివ్వకుండా, అహంకారమునకు అవకాశము యివ్వకుండా అందరు సోదర సోదరీమణులుగా భావించుకుని మీరు ఆనందంగా సేవలు చేయండి. ఈనాడు విద్యా విధానములో అనేక మార్పులు తెప్పించాలని మీరు సంకల్పించుకున్నారు. విద్య చాలా అవసరమైనది. విద్య దొంగలకు చిక్కేది కాదు. అగ్నికి కాలేది కాదు. ఎవరైనా పంచుకోటానికి ప్రయత్నం చేస్తే పంచుకునేది కాదు. ఎప్పుడు విద్య విద్యగానే పెరుగుతూ ఉంటుంది. ఇట్టి పరమ విద్యల జగత్తుకందించండి. వాటిని ఆచరణలో పెట్టుటకు ప్రయత్నం చేయండి. పిల్లలకంతా మంచి సద్గుణములు బోధించండి. "నాయనా! నీవు ధనముకోసం కాదు చదివేది. ఈనాడు డబ్బు ఉండవచ్చు. రేపు పోవచ్చును. Money comes and goes. ఈనాడు స్నేహితుడు రేపు నీ శత్రువు. కాబట్టి వాడు కూడా మారిపోవచ్చు. బలము. ఈనాడు బలంగా ఉంటున్నాడు. రేపు బలహీనుడు కావచ్చు. కానీ, గుణము మాత్రము ఎప్పటికి పోదు. శాశ్వతమైన గుణాన్ని మీరు పెంచుకోండి. పవిత్రమైన గుణాన్ని మీరు అభివృద్ధి పరచుకోండి. ఆ గుణముచేత సమాజములో మీరుప్రవేశించండి. అందరికీ help చేయండి. ఈ చేతులు మీకు యిచ్చింది దేనికోసమని? "హస్తమునిచ్చినదెందుకో తెలుసా?" తినడానికి కాదు యిచ్చింది హస్తము, పరోపకార

srisathyasaivachanamrutam

నిమిత్తమై వచ్చింది హస్తము. ఇదే మనకు అలంకారము. మనకు కంఠము నిచ్చింది ఎందుకో తెలుసునా? సినిమా పాటలు పాడటానికి కాదు. పరులను దూషించటానికి కాదు. పరులను నిందించటానికి కాదు. దైవనామాన్ని స్మరించటానికి. ఆ దైవనామాన్ని స్మరించటమే మంచి beautiful నెక్లెస్. ఆ నెక్లెస్‌ను ధరించండి. ఆ పవిత్రమైన నామముతో మీ కంఠమును సార్థకము చేసుకోండి. తెలివితేటలు యిచ్చినదెందుకో తెలుసా? అహంకార పడటానికా? కాదుకాదు. దైవత్వాన్ని మనం ఏరీతిగా చింతించాలి? దైవత్వాన్ని ఏరీతిగా పొందాలి. దైవత్వాన్ని ఏరీతిగా అనుభవించాలి? అనే చింతన చేయటానికి మాత్రమే ఈ తెలివితేటలు యిచ్చింది. కనుక, ప్రతి అంగమును మనము పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టాలి.

## Happiness is with union God

ప్రేమస్వరూపులారా! 180 దేశములనుండి వచ్చారు ఈనాడు. ముఖ్యంగా సంస్థలలో ప్రధానమైన స్థానాన్ని పొందినవారు, Office bearers వచ్చారు. మీరు సరైన మార్గములో సక్రమంగా నడచుకున్నప్పుడు ఎన్ని వేల మందినైనా మనం తీర్చి దిద్దవచ్చు. ఒక్కరినుంచి ఎంతమందినో మనం మంచి చేయవచ్చు. దీనిలో మీరు చాలా జాగ్రత్తగా మెలగాలి. ఆఫీసు బేరరు ఒక్కడు చెడిపోతే అనేకమంది చెడిపోతారు. బాధ్యత ఉన్న వ్యక్తివి కనుక నీవు మంచిగా ఉండు. నీవు మంచిగా జీవించు. మంచిగా ఆచరించు. మంచిగా ఆలోచించు. అప్పుడు అందరు మంచి ఆదర్శమును పొందుతారు. నీవు ఆచరించడం మాని పదిమందికి చెప్పుతూ కూర్చుంటే లాభం లేదు. అన్నీ చేయకపోయినా ఒకటి రెండైనా మీరు చేసి చూపించండి. One or two అంతే చాలు. అంతేకానీ అన్నీ చూపించమని నేను కోరటం లేదు. **మీరు ఆదర్శమూర్తులుగా తయారై సత్యసాయిసంస్థలందు సమమైన అభివృద్ధిని కల్పించి దేశాన్నే బాగుచేయాలి. నా పేరు కోసం నేను ఆశించటం లేదు. నాకు ఏ పేరు ప్రతిష్టలు అవసరం లేదు. నేను యింకా ఆశించటం లేదు కానీ ఆశించి ఉంటే ప్రపంచం ఒక్కసారిగా యిక్కడ వాలిపోతుంది. ఎప్పుడు స్వామి చేయి, యిచ్చేదే, యిచ్చేదే. పుచ్చుకునేది లేదు.** Gives, gives. Except one. ఒక్కటి మాత్రమే తీసుకుంటాను. Only one. ఒక్కటి మాత్రమే అడుగుతాను Love, Love, Love. అదే మీ ప్రేమ. మరేదీ వద్దు.

srisathyasaivachanamrutam

ఏదానిని నేను ఆశించను. మీరు ఏం కోరినా నేను యిస్తాను. నీవు ఎన్ని కోరినా యిస్తాను. నేను ఆశించేది ఒక్కటే. అదే love. ఈ ప్రేమను యిచ్చుకొని సర్వమును పుచ్చుకోండి. Education లోపల మీరు చక్కగా పని చేయాలి. ఏ దేశము వారు ఆ దేశము వారితో సంప్రదించుకోండి. ఏదో సెంటరు నుండి మాకు ఆర్డరు రావాలని కాచుకోనక్కరలేదు. మీరందరు కలసిమెలసి పనిచేస్తుంటే centre ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. మీ మీ దేశముల లోపల భేదాలు లేకుండా, అసూయలు లేకుండా, ఒకరికొకరు పోట్లాడుకోకుండా అన్నదమ్ములవలె మెలగినప్పుడు నాకు అంతకంటే కావలసింది ఏముంది? స్వామి యొక్క మనస్సుతో చేరి స్వామి సంకల్పముతో మీరు చేరి పనిచేస్తే యింతకంటె ఆనందము ఏముంది? Happiness is union with God. ఈ భగవద్భావముతో కూడి మీరు పనిచేయండి. అదే నిజమైన happiness. ఏదో ప్రపంచములో భౌతిక విషయాలకు happy గా ఉన్నామంటే యిదికాదు నిజమైన ఆనందము. కనుక మీరు మీరు ఎలాంటి ద్వేషాలుండినప్పటికి ఎలాంటి భిన్నాభిప్రాయములు ఉన్నా ఒకరికొకరు కలసి మెలసి పనిచేయాలి. ఒకరు ఒక గుంపుగా, ఒకరు మరొక గుంపుగా ఉండకూడదు. ఈ వేళ కేవలం మీరు ఒకరిని బాధపెట్టినట్టుగా భావిస్తారు. కాదుకాదు. ఆబాధ నాకు వస్తుంది. కనుక అందరు ఒకటిగా ఉంటే నేను ఆనందిస్తాను. అందరు ద్వేషము లేకుండా ప్రేమతో ఉండండి. ద్వేషముండినా మింగాలి, కానీ బయట పెట్టి ఎదుటి వారిని ద్వేషించటానికి ప్రయత్నం చేయకూడదు. మీరు ఐకమత్యంచేత, యిక్కడ నుండి మీరు వెళ్ళిన తరువాత మీ ద్వేషులుంటే what brother అని వారిని పలుకరించు. ఆవిధమైన ప్రేమతో మీరు సంప్రదించాలి. ఇదియే నిజమైన తపస్సు. ఇదే నిజమైన ధ్యానము. ఇదే నిజమైన జపము. ఇదే నిజమైన సాధన.

ప్రేమను ప్రేమకై యిచ్చి పుచ్చుకోవాలి. ప్రేమ యిచ్చి, ప్రేమను పుచ్చుకో. ఈవిధంగా మీరు అభివృద్ధి చేస్తే దేశమంతా happy గా నిల్చిపోతుంది. ఏ యుగములో లేని ఆనందాన్ని ఈ యుగములో మీరు అందుకోవచ్చును. మీరందరు ఐకమత్యంగా ఉండి అన్నదమ్ములవలె పెరిగి పెద్ద అయి ఈ ప్రపంచమునకు ప్రేమతత్వము చాటాలి. బ్రదర్, బ్రదర్‌అని చెప్పేది, హలో, హలోఅని చెప్పేది, సాయిరాం సాయిరాం అని చెప్పేది. కానీ చెప్పటంలోనే

తెలుస్తుంది, భేదముంటే. హాలో, సాయిరాం అని మెకానికల్‌గా చెప్పటం కాదు. Happy mood, happy talk నవ్వుతూ మాట్లాడాలి. నవ్వులు కూడా సినిమా నవ్వులు కాదు. హృదయపూర్వకంగా నవ్వాలి. past is past. Forget the past. Do not worry about the future. Present is very important ఇది omni present. అందరు hellow అని చెప్పాలి. ఈ ఐకమత్యాన్ని మీరు అభివృద్ధి పరచుకోండి. ఐకమత్యములో ఎంత బలమో ఉంటున్నాది. విడిపోతే ఏ మాత్రము బలం ఉండదు. కేవలం మీకు మీరు చెడగొట్టుకోటమే అవుతుంది. ముఖ్యంగా ప్రేమతో ఉంటే ఎంతైనా unity జరుగుతుంది. మూడు దినముల నుంచి అనేక విధములుగా మీరు వాదోపవాదాలు వేసుకుంటూ సంప్రదింపులు జరుపుకుంటూ వచ్చారు. ఈనాడు పూర్తిగా ఆ దోషాలంతా దూరం చేసేయండి. చక్కగా కడిగిన ముత్యంలా clean గా ఉండండి. ఆనందంగా ఉండండి. మీరు ఆనందంగా తిరిగి వెళ్లండి. ఇదొక పెద్ద work-shop. ఈ కార్లనే దేహాలతో మీరు వచ్చారు. దీనిలోని nuts, bolts, springs అన్నీ చెడిపోయినాయి. ఇక్కడకు వచ్చారు. ఈ workshop లో సరిచేసుకుపోతే పెయింటు కూడా కొత్తగా వేసుకుపోవాలి. మీరు మీ దేశానికి పోతూనే మీరు మాట్లాడే తీరుచూస్తే ఇతరులు కూడా అబ్బా! పుట్టపర్తి పోయి వచ్చి ఎంత మార్పు చెందారు! అని ఇతరులు కూడా మిమ్మల్ని మెచ్చుకోవాలి. ఆ ఆశ్చర్యమును మీరు యితరులకు కల్పించాలి. ఆ ఆనందమును జగత్తు కందించాలి. ఆ ఆదర్శమును పొందాలి. కనుక అధికంగా చెప్పి చాలా confusion చేస్తున్నానేమో. ప్రేమతో నేను చెబుతున్నాను. మీరు బాగుపడాలి. ఇతరులను బాగు పర్చాలి. నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. తిరిగి అక్కడ cultural program ఉన్నాది. ఇంకా ముక్కాలు గంట ఉంది. మీరు చక్కగా అక్కడకు రండి.

**(తేదీ 24-11-1998న కుల్వంత్‌హాల్‌లో విదేశాలలోని శ్రీ సత్యసాయి సెంటర్ల అధ్యక్షుల సమావేశముల ముగింపు సందర్భంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam